క్లుప్తంగా

నేటి నుంచి గోపాలస్వామి కల్యాణోత్సవాలు

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు జరుగతాయని ఆలయ అర్చకుడు శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు తెలిపారు. గురువారం అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు శేష వాహనోత్సవం, సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి దివ్యకల్యాణం జరుగుతుందన్నారు. 4న నిత్యహోమాలు, 5న వేద ఆశీర్వచనం, 6న నిత్య హోమాలు, 7న పూర్ణాహుతి చక్రస్నానం జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటల నుంచి మహా అన్నసంతర్పణ, 8వ తేదీన శ్రీపుష్ప మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

శివాలయానికి వెండి అందజేత



వెండిని అందజేస్తున్న దాతలు

కడియం: మాధవరాయుడుపాలెంలో నిర్మితమవుతున్న శివాలయానికి 7 కేజీల వెండిని బుధవారం సమర్పించారు. నాగాభరణం నిమిత్తం గ్రామానికి చెందిన అన్నందేవుల మునియ్య కుమార్తె ఏపూరి సరోజిని, వెంకట్రావు దంపతులు రూ.5 లక్షల విలువ చేసే వెండిని గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి, శివాలయ కమిటీ అధ్యక్షుడు అన్నందేవుల వీరభద్రరావు(చిన్నారి), సభ్యులకు అందజేశారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కడియం: స్థానిక పడాల వారి వీధిలో గ్రామస్తులు, భక్తుల సహకారంతో పునర్నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం జరిగే విశిష్ట పూజల్లో ఆలయ నిర్మాణానికి భూరి విరాళం అందజేసిన చిక్కాల ఉమామహేశ్వరరావు, రాధామాధవి దంపతులతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితుడు వేదాంతం జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అదే రోజు భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

మెడికల్ కిట్లు అందజేత

కడియం: బుర్రిలంక గ్రామానికి చెందిన మిత్ర ఫౌండేషన్ నిర్వాహకుడు ఏలూరి శ్రీరామచంద్రం బుధవారం 30 పాఠశాలలకు ప్రథమ చికిత్స కిట్లను అందజేశారు. తన తల్లి లక్ష్మి జ్ఞాపకార్థం పాఠశాలల్లో విద్యార్థులకు అత్యవసర వేళల్లో ప్రథమ చికిత్స కోసం వీటిని అందించినట్టు తెలిపారు. కడియం, కడియపులంక, కడియపు సావరం, కేశవరం, జేగురుపాడు తదితర గ్రామాల్లో స్కూళ్లకు రూ.25 వేల విలువైన కిట్లను అందజేశారు. కడియం నంబర్ 1 స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మణ్ కుమార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ జరపాలి

సీటీఆర్ఐ: పోలీసు, జ్యుడీషియల్ కస్టడీలో ఎవరైనా మరణిస్తే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ మహాసభ సభ్యులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ అడ్డతీగల మండలం అచ్చియ్యపేటకు చెందిన కన్నోజి రాజబాబు అనే రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రిమాండ్ ఖైదీ ఫిబ్రవరి 25వ తేదీ తెల్లవారుజామున మృతి చెందారన్నారు. 3వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. మరణించిన 24 గంటలలోగా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విచారణ జరపాల్సి ఉండగా ఈ కేసులో ఎటువంటి చట్ట నిబంధనలు పాటించలేదని ఆరోపించారు.

లింగవివక్షపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు బుధవారం బొమ్మూరులోని నేక్ కేంద్రంలో లింగవివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కిల్ కళాశాల, స్కిల్ హబ్, డీడీయూ–జీకేవై శిక్షణా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కంబాలచెరువు: ఫ్రెండ్ సర్వీసెస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎనలేనివని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దుర్గాప్రసాద్ అన్నారు. డాక్టర్ గోలి రామారావు ఆధ్వర్యంలో పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. డెర్మటాలజిస్ట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎఫ్ఎస్ఎస్ సభ్యులు రాము, వెంకట్, వీరయ్య పాల్గొన్నారు.

అరకొర సిబ్బంది.. సేవలకు ఇబ్బంది

- రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి
- ప్రజలకు అవస్థలు



రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ కార్యాలయం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల ముంగిటకు సేవలందిస్తున్నారు. ఇవన్నీ సక్రమంగా జరగాలంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి పలు సేవలు అందించాల్సి ఉంది. అయితే తహసీల్దార్ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు ఇవీ..

రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, వాచ్‌మన్, అటెండర్ పోస్టులు ఉండాలి. ప్రస్తుతం తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.శ్రీనివాస్‌ను కలెక్టరేట్‌లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం రీసర్వే ప్రాజెక్టుకు బదిలీ చేశారు. రూరల్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న యామిని జాయింట్ కలెక్టర్ సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. ఏఆర్ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్ కలెక్టర్ సీసీగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సాగర్ పదోన్నతిపై రూరల్ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులు కావడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన జనార్దన్ కడియం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పదోన్నతిపై వెళ్లిపోవడంతో ఆపోస్టు ఖాళీగా ఉంది. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సాగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల విధులు ఈ మండలం నుంచే నిర్వహించాలి. జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గం కూడా.

సమస్యలు అధికం

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో పది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నిత్యం అధిక సంఖ్యలో ప్రజల నుంచి అనేక సమస్యలతో ఫిర్యాదులు వస్తుంటాయి. వీటిని పరిష్కరించడంతో పాటు రెవెన్యూ అధికారులకు కుటుంబ సభ్యుల ధ్రువపత్రాల పరిశీలన, కోర్టు కేసులు, భూవివాదాలు, సీపీఎల్ఏ నుంచి అత్యవసర సమాచారం అందించడం, ప్రతి సోమవారం కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో జరిగిన స్పందనలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, భూముల రీసర్వే పిటిషన్లు, భూప్రతిపాదనలు, జగనన్న భూసర్వే, పొజిషన్ సర్టిఫికెట్ల జారీకోసం క్షేత్రస్థాయి సర్వేలు, కిందిస్థాయి పర్యవేక్షణ వంటి అనేక పనులు నిత్యం రెవెన్యూ అధికారులకు ఉంటాయి. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో రాత్రి 10 గంటల వరకు ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ స్పందించి రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సుస్వాగతం..











నిడదవోలులో జరిగిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు కుమార్తె, అల్లుడు వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీసీసీబీ ఆకుల వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వాగతం పలికారు.

– రాజమహేంద్రవరం సిటీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కడియపులంకలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియం, కడియపులంకలో సమావేశాలు

కడియం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ఈ సమాచారం ప్రతి కుటుంబానికి చేరువ చేసే బాధ్యతను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియం, కడియపులంక గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ జగనన్న నిర్దేశించిన మార్గంలో మన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ నడవాలన్నారు. గృహసారథులు తమకు కేటాయించిన కుటుంబాలను కలిసి, కనీసం 20 నిమిషాలు మాట్లాడాలన్నారు. వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలను వివరించాలన్నారు. ఒకవేళ ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వలంటీర్‌కు తెలియపరిచి, పరిష్కరించే దిశగా సూచనలు ఇవ్వాలన్నారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి కాబట్టి.. మన భవిష్యత్తు మన జగనన్న అని తెలియజేయాలన్నారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అధ్యక్షతన గిరజాల కల్యాణ మండపంలో, కడియపులంకలో నెహ్రూ విశాల సహకార పరపతి సంఘం వద్ద సమావేశాలు జరిగాయి. మండలం జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి, పలు గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

4న జీవిత బీమా ఉద్యోగుల మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల 26వ వార్షిక మహాసభలు ఈనెల నాలుగో తేదీన జేఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో జరుగుతాయని ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏఎఫ్ బెనర్జీ, పి.సతీష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మోరంపూడి ఎల్ఐసీ డివిజినల్ ఆఫీస్ ప్రాంగణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలను అఖిల భారత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.రమేష్ ప్రారంభిస్తారని, ముఖ్యవక్తగా సంఘ పూర్వపు ప్రధాన కార్యదర్శివేణుగోపాల్ , కోశాధికారి బీఎస్ రవి, జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎంఎస్ రవీంద్రనాథ్ పాల్గొంటారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో ఉద్యోగుల సంఘం నాయకులు రాంబాబు, కోదండరాం, భరణి, గనియ్య ,విశ్వనాథ్, శ్రీనివాస్ , పట్నాయక్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చినకొండేపూడిలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, గీతిక

సీతానగరం: మండల గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆంద్ర ఫణీంద్ర అన్నారు. చినకొండేపూడిలో 289, వెదుళ్లపల్లిలో 298 పశువులకు బుధవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పశువైద్యశాల, రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని గ్రామాల్లోని ఆవులు, గేదెలు, దూడలకు గాలికుంటువ్యాధి (గాళ్లు) నివారణ టీకాలు వేస్తామన్నారు. బుధ, గురువారాల్లో చినకొండేపూడి–2, వెదుళ్లపల్లి, 3న చినకొండేపూడి–1, కూనవరం, 4, 5, 6న రఘుదేవపురం–1, మిర్తిపాడు, 7, 8న నాగంపల్లి, బొబ్బిల్లంక, 9, 10న రఘుదేవపురం–3, బొబ్బిల్లంక, 11, 12న రఘుదేవపురం–2, బొబ్బిల్లంక, 13, 14న సీతానగరం –2, కాటవరం, 15, 16న సీతానగరం–1, ఉండేశ్వరపురం, 17, 18న సింగవరం, ఉండేశ్వరపురం, 19, 20న వంగలపూడి, ముగ్గళ్ల, 21, 22, 23న పురుషోత్తపట్నం, ముగ్గళ్ల, 24న ఇనుగంటివారిపేట, 27న ములకల్లంక, 30న మునికూడలిలో నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు వై.సుధాకర్, జి.వెంకటేష్, కె.మునేంద్ర, ఎం.గీతిక, ఐ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కంబాలచెరువు: విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని ప్రాంతీయ విద్యా సంచాలకులు జి.నాగమణి అన్నారు. స్థానిక నారాయణపురం ప్రాథమిక పాఠశాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి , సక్రమంగా దిద్దకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 3, 5వ తరగతి విద్యార్థులతో కొన్ని పదాలు చదివించి, వారి తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి వర్క్‌బుక్ కరెక్షన్స్‌పై పలు సూచనలు చేశారు. వాటికి అనుగుణంగా మిగిలిన విద్యార్థుల వర్క్‌బుక్ కరెక్షన్స్ పూర్తి చేయించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పార్వతిని ఆదేశించారు. అక్కడి నుంచి దివాన్ చెరువు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎనిమిదో తరగతిలో ఎక్కువ మంది ఆబ్సెంట్ అవడాన్ని గమనించి ప్రశ్నించారు. బైజుస్ ట్యాబ్‌ల్లో ప్రగతి తక్కువ ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతి ప్రత్యేక తరగతులు నిర్దేశిత కాల నిర్ణయ పట్టిక ప్రకారం నిర్వహించాలన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు 80 శాతం పింఛన్ల పంపిణీ



జాన్‌కు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఝాన్సీ



59 డివిజన్‌లో పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్ డాక్టర్ అనుసూరి పద్మలత

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలిరోజు బుధవారం 80 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నగరంలోని 29,313 మందికి ప్రభుత్వం రూ.8,20,51,000 విడుదల చేసింది. 31వ డివిజన్ అన్నపూర్ణమ్మపేటలోని 57వ సచివాలయం పరిధిలో ఉంటున్న జాన్ అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు వలంటీర్ ఝాన్సీ బుధవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించింది.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మూరు సత్యనారాయణ నగర్‌కు చెందిన సాయి కృప ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్‌లో ముదునూరి సునీత (55) నివాసం ఒంటరిగా ఉంటోంది. ఆమె మూడు రోజులుగా ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఎదుటి ఫ్లాట్‌లో నివసిస్తున్న ముక్కుడుపల్లి నిర్మల బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై శివాజీ, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పంచాయతీ సిబ్బందితో ఫ్లాట్ తలుపులు పగలుగొట్టి చూడగా సునీత ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఆమె రెండురోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సునీత క్యాన్సర్‌తో బాధపడుతూ ఒంటరిగా జీవిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో ఉంది.

నిబంధనల మేరకు సర్వే రాళ్ల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

పెదపూడి: జగనన్న భూ రక్ష, జగనన్న భూ సమగ్ర రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ల ఏర్పాటు (పాతటం) కార్యక్రమం నిబంధనల ప్రకారం జరగాలని జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో రాళ్ల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాలకు గాను 11 చోట్ల భూ రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడానికి మండలానికి 13,707 రాళ్లు వచ్చాయన్నారు. ఇందులో ఏ కేటగిరీ రాళ్లు, బీ కేటగిరీ రాళ్లు అనే రెండు రకాలు ఉన్నాయన్నారు. వాటిలో ఏ కేటగిరీ రాళ్లు గ్రామాల సరిహద్దును సూచిస్తాయన్నారు. బీ కేటగిరీ రాళ్లు గ్రామాల్లో ప్రజల భూ స్థలాల సరిహద్దును తెలియజేస్తాయన్నారు. ఇప్పటి వరకు 520 రాళ్ల ఏర్పాటు పూర్తయిందన్నారు. మండలంలో మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఆ టీమ్‌లు రోజుకు 150 రాళ్లు ఏర్పాటు చేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఖాయం



ముద్దాల అనును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని, దానికి ముద్దాల అను నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకుడు యెనుముల త్యాగరాజు అన్నారు. ముద్దాల తిరుపతిరావు (అను)ను జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా బుధవారం ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో బొమ్మూరు కొత్తపేటలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ అను అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు దాకే శ్రీనివాసరావు, ఎలుగొండ లక్ష్మి మాట్లాడుతూ ముద్దాల అను మరిన్ని పదవులు అలంకరించాలని ఆభిలాషించారు. కార్యక్రమంలో సోమన శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

ప్రకాశం నగర్: చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిస్తున్న 11 మంది పేద విద్యార్థులకు రూ.37 వేల కళాశాల ఫీజును సీపీటీసీ సభ్యుడు, ఎస్‌కేవీటీ కళాశాల పూర్వ విద్యార్థి అక్కిన శ్రీనివాస్ చౌదరి బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ విభాగాధిపతి పీఏ.కిషోర్ బాబు, అధ్యాపకులు జి.వెంకటరమణ, పీవీ సంజీవరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ సీటీఐగా చంద్రమౌళి



రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా సుంకర చంద్రమౌళిని నియమిస్తూ విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ సీటీఐగా విధులు నిర్వహించిన కేశవభట్ల శ్రీనివాసరావు జనవరిలో ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఏలూరులో సీటీఐగా విధులు నిర్వహిస్తున్న సుంకర చంద్రమౌళిని నియమించారు. వీరితో పాటు విజయవాడ స్క్వాడ్‌లో టీటీఐగా పనిచేస్తున్న జీవీఎన్ భవానీని రాజమహేంద్రవరం టీటీఐగా నియమించారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో టీటీఐగా పనిచేస్తున్న పీఎస్‌వీవీఎన్ రామారావును భీమవరం స్క్వాడ్ టీటీఐగా బదిలీ చేశారు. కాగా.. స్టేషన్ సీటీఐగా నియమితులైన చంద్రమౌళిని పలువురు అభినందించారు.

బొంతా శ్రీహరికి పితృవియోగం

ప్రకాశం నగర్: వైఎస్సార్ సీపీ నాయకుడు, నాలుగో డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరికి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి సత్యనారాయణ (75) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఇటీవలే సత్యనారాయణ భార్య వీరరాఘవమ్మ మృతి చెందారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే శ్రీహరి తల్లిదండ్రులను కోల్పోయారు. కాగా.. పార్టీ నాయకులు, డివిజన్ వాసులు శ్రీహరి నివాసానికి చేరుకుని సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కోటిలింగాల కైలాసభూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్లీనరీ విజయవంతం

రాజమహేంద్రవరం సిటీ: చత్తీస్‌గఢ్‌లోని నయా రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ 85వ ప్లీనరీ విజయవంతమైందని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు రైతులు, యువత, మహిళా సాధికారతకు పలు కీలకమైన తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు. స్థానిక కృష్ణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, పీసీసీ కార్యదర్శి ముళ్లమాధవ్ మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ప్లీనరీ సమాయత్తం చేసిందన్నారు. దేశ సందపను ఆదానీ కంపెనీకి దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు బ్లాక్ లెవెల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.